ఉచితంగా టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రతినిధులు, మహిళలు

సుభాష్‌నగర్: నిర్మాణ్, మైండ్‌స్పేస్ సంస్థల ద్వారా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఉచితంగా టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణను అందిస్తున్నామని నిర్మాణ్ సంస్థ మేనేజర్ ఆదర్శ్ పేర్కొన్నారు. బహదూర్‌పల్లి చౌరస్తాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ పొందిన 60 మందితో కలిసి 30 చెట్లను మంగళవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన పలువురికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయని, మహిళలు సాధికారత సాధించేదిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య , ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మైమూన్, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు మంజునాథ్, భీంరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు పరుగు..!



జగద్గిరిగుట్ట: చింతల్, పద్మానగర్ ఫేజ్–1 నుంచి కల్పన సొసైటీ వెళ్లే దారిపై మురుగు వరదలా పారుతోంది. దీంతో విద్యార్థులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు, డ్రైనేజీ కావడంతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా లేక నిత్యం ఏదో ఒక చోట మురుగు పొంగుతూనే ఉంటుంది. అధికారులకు ఫిర్యాదు చేసిన రెండు రోజులకు వచ్చి తాత్కాలిక పరిష్కారం చేసి వెళుతున్నారు. మళ్లీ అదే సమస్య పునరావృత్తం అవుతున్నదని, ఇకనైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రిజర్వాయర్ల నిర్వహణ గాలికి..!

- అంతంతమాత్రంగానే మెయింటనెన్స్
- చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, కుంగుతున్న భూమి
- ప్రశ్నార్థకంగా మనుగడ
- పట్టించుకోని అధికారులు



ఫతేనగర్‌కు నీటిని సరఫరా చేసే రిజర్వాయర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

చింతల్: కోట్లాది రూపాయాల నిధులతో నిర్మించిన రిజర్వాయర్ల నిర్వహణను సంబంధిత అధికారులు గాలికి వదిలేశారు. దీంతో వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి భూమి కుంగడంతో వాటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ప్రారంభం నుంచి ఇప్పటివరకు సదరు నిర్మాణ సంస్థ తూతూ మంత్రంగానే నిర్వహణ పనులు చేపడుతూ వస్తోంది. అక్కడక్కడ మరమ్మతులు, మిగిలిన పనులను మళ్లీ జలమండలి విభాగం ఆధ్వర్యంలోనే చేపడుతున్నారు. కూకట్‌పల్లికి చెందిన రిజర్వాయర్ కుత్బుల్లాపూర్‌లోని షాపూర్‌నగర్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలోని పంప్ హౌస్ పక్కనే నిర్మించారు. ఇక్కడి నుంచే ఫతేనగర్ సెక్షన్ పరిధిలోని కాలనీలు, బస్తీల ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారు.

నిర్వహణను మరిచిన అధికారులు..

జలమండలి కూకట్‌పల్లి డివిజన్–9 పరిధిలోకి వచ్చే ఫతేనగర్ సెక్షన్‌లో స్థలాభావం కారణంగా షాపూర్‌నగర్‌లోని పంప్ హౌస్ పక్కన 6 ఎంఎల్ రిజర్వాయర్‌ను నిర్మించారు. దీని నుంచే ఫతేనగర్‌లోని పంపింగ్ కేంద్రానికి నిరంతరం నీటిని తరలిస్తూ ఆయా బస్తీలు, కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ రిజర్వాయర్ చుట్టుపక్కల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అవి రిజర్వాయర్ నాణ్యతను దెబ్బతీసేలా ఉండడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రిజర్వాయర్ల నిర్మాణంలో టెండర్లు దక్కించుకున్న పలు కార్పొరేట్ సంస్థలు మెయింటెనెన్స్ సుమారు 3 నుంచి 4 ఏళ్ల పాటు చూడాల్సి ఉన్నా ఇటువైపు కన్నెటి చూడకపోవడం విశేషం.

కుంగుతున్న రిజర్వాయర్ పరిసర ప్రాంతం..

ఫతేనగర్ రిజర్వాయర్ చుట్టూ ఉన్న ఖాళీ స్థలం రోజురోజుకు కుంగిపోతోంది. చుట్టూ ప్రహరీ వాల్ నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో భూమి లోపలికి కుంగిపోతోంది. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో రిజర్వాయర్ నాణ్యతపై ప్రభావం చూపనున్నది. రిజర్వాయర్ చుట్టూ వేసిన సిమెంట్ బెడ్డు రిటైనింగ్ వాల్ కుంగిపోవడంతో చుట్టుపక్కల నీరు నిలిచిపోతోంది. వీటిపై దృష్టి సారించాల్సిన జలమండలి డివిజన్ అధికారులు, ఫతేనగర్ సెక్షన్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది.

ఛాంబర్ల మూతలు మాయం..!

కుత్బుల్లాపూర్‌కు సరఫరా చేసే 7.5 ఎంఎం రిజర్వాయర్ భారీ నీటి పైపులైన్లను అనుసంధానం చేసే ఛాంబర్లకు ఏర్పాటుచేసిన మూతలు ఇటీవల మాయమయ్యాయి. భారీ పైపులైన్ నుంచి రిజర్వాయర్‌కు అనుసంధానం చేసే మెయిన్ వాల్వ్‌లకు ఏర్పాటుచేసిన అల్యూమినియం మూతల జాలీలను గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. అదేవిధంగా కైసర్‌నగర్‌లోని రిజర్వాయర్ ప్రధాన డోర్‌కు ఏర్పాటుచేసిన అల్యూమినియం డోర్ సైతం మాయమైంది. అయితే వీటిని ఎవరు ఎత్తుకెళ్లారనేది ప్రశ్నార్థకంగా మారింది. షాపూర్‌నగర్ సబ్ డివిజన్ కార్యాలయంలో 24 గంటల పాటు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా మూతలు మాయం కావడంపై అధికారులే క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.



ఎంఎల్ రిజర్వాయర్ వాల్వ్ జాలీ మాయం



కుత్బుల్లాపూర్ రిజర్వాయర్ వద్ద పిచ్చి మొక్కలు

డ్రైవర్లు నియంత్రణ కోల్పోవద్దు



బహుమతులు అందజేస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

జీడిమెట్ల: ఆర్టీసీ డ్రైవర్లు నియంత్రణ కోల్పోకుండా బస్సులు నడపాలని జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. జీడిమెట్ల డిపోలో మంగళవారం నిర్వహించిన ప్రమాదరహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 30 ఏళ్లుగా ఒక్క ప్రమాదం జరగకుండా బస్సు నడుపుతున్న డ్రైవర్లు నర్సింహులు, కేఆర్.రెడ్డి, వాసుదేవ్‌ను డిపో మేనేజర్ ఆంజనేయులుతో కలిసి సన్మానించారు. అనంతరం డీఎం మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత చాలా అవసరమన్నారు. ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా 'లక్ష్యే లక్ష్యం' పేరిట నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ నీలామణి, అసిస్టెంట్ ఇంజినీర్ సందీప్, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు అందజేత



విద్యార్థులకు పండ్లు అందజేస్తున్న కౌన్సిలర్ జక్కుల కృష్ణయాదవ్

దుండిగల్: దుండిగల్ జడ్పీ పాఠశాలలో కౌన్సిలర్ జక్కుల కృష్ణయాదవ్ తన మాతృమూర్తి ఐశ్వర్య జ్ఞాపకార్థం మంగళవారం విద్యార్థులకు ఆపిల్, అరటి పండ్లను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు ముత్యంగౌడ్, స్థానిక నాయకులు కుంటి వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, బాల్‌రాజ్‌యాదవ్, నర్సింగ్‌గౌడ్, అరుణ్ గౌడ్, ఏలూరి శివుడు, రాజుగౌడ్, పిట్ల రమేశ్, భానుగౌడ్ తలారి రాజు, నాగరాజ్ పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారణకు చర్యలు



వీధికుక్కను తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: వీధి కుక్కల బెడదను నివారించేందుకు బ్లూక్రాస్ సంస్థతో కలిసి పని చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. బహదూర్‌పల్లి వార్డులో మున్సిపల్, బ్లూక్రాస్ సొసైటీ సభ్యులు సంయుక్తంగా 14 వీధి కుక్కలను మంగళవారం పట్టుకున్నారు. వీటికి స్టెరిలైజేషన్ ఆపరేషన్, యంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసి వదిలిపెడతామని కమిషనర్ తెలిపారు. ఆహారం, తాగునీరు లభించని సమయాల్లో కుక్కలు వింతగా ప్రవర్తిస్తాయని, వాటిని చూసి భయపడకుండా ఆహారాన్ని అందించాలని ఆయన సూచించారు. జవాన్ సురేందర్, బ్లూక్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ముఖాల్లో సంతోషం నింపడమే లక్ష్యం

- రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్
- బ్యాంకర్లు రైతులకు వెంటనే పంట రుణాలు అందజేయాలి



రైతులకు రుణమాఫీ చెక్కును అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: పంట రుణమాఫీతో రైతుల ముఖాల్లో సంతోషం నింపడమే కాకుండా, రైతు కుటుంబాలను ఆర్థికంగా పటిష్ట పరచడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రైతు రుణమాఫీ రెండో విడతలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో రైతురుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ ,అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా, డీఏఓ మేరీరేఖతో కలిసి రుణమాఫీ చెక్కులను రైతులకు అందజేశారు. రుణమాఫీ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని వచ్చే రబీ, ఖరీఫ్ సీజన్లలో అధిక పంటలు పండించి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు.

- మొదటి విడతలో జూలై 18న రూ.లక్ష వరకు ఉన్న పంట రుణాలను సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం రెండో విడత రుణమాఫీలో రూ. లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు చెక్కులు అందజేస్తున్నామన్నారు. సాంకేతిక కారణాల వల్ల పంట రుణమాఫీ జరగకపోతే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గ్రామ, మండల, జిల్లాస్థాయిల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌లో వివరాలు తెలుసుకుని, రుణమాఫీ కాని పక్షంలో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు.
- మాఫీ జరిగిన రైతులకు వెంటనే పంటలకు అవసరమైన రుణాలను అందించాలని లీడ్ బ్యాంక్ మేనేజరుతో సహా బ్యాంకర్లను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అందించే ఆర్థిక చేయూత ఉపయోగకరమని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందన్నారు. రుణమాఫీ మొత్తం లోన్ అకౌంట్లలో పడకపోతే ఆందోళన చెందకుండా వ్యవసాయ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికాగుప్తా మాట్లాడుతూ.. మూడో విడతలో మిగిలిన వారందరికీ రుణమాఫీ జరుగుతుందని వివరించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రేఖామేరి, మున్సిపల్ చైర్మన్లు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

శివశివానీ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

కుత్బుల్లాపూర్: కొంపల్లికి చెందిన శివశివానీ డిగ్రీ కళాశాల యూజీసీ స్వయం ప్రతిపత్తి హోదా పొందింది. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థల చైర్మన్ ఆరతి సంపతి మాట్లాడుతూ 2002లో 12 మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాలలో ప్రస్తుతం 2600 మంది పైచిలుకు విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. చదువుతో పాటు పలు కార్యక్రమాలు, క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములును చేస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. యూజీసీ స్వయం ప్రతిపత్తి తమపై మరింత బాధ్యతను పెంచిందని, విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దే విధంగా నిలబస్‌ను రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

కుత్బుల్లాపూర్: తెలంగాణ స్టేట్ తైక్వాండో ఛాంపియన్ షిప్–2024లో కుత్బుల్లాపూర్‌కు చెందిన ఛాంపియన్స్ మార్షల్ ఆర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీ విద్యార్థులు సత్తాచాటారు. నగరంలోని యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన పోటీల్లో కేడెట్ క్యాటగిరీ గర్ల్స్ విభాగంలో నాగసాయి అరుణ, బాలుర కేడెట్ కేటగిరీలో ధ్రువ, జూనియర్ విభాగంలో ఆదిత్య గోల్డ్ మెడల్స్ సాధించారు. వీరు ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న జాతీయ కేడెట్ నేషనల్ టోర్నమెంట్, మహారాష్ట్రలో జరిగే జూనియర్ నేషనల్ కేడెట్ విభాగాలకు ఎంపికయ్యారని కోచ్‌లు మధుసూదన్, అరుణ్ తెలిపారు.

ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్‌లో ఎన్నికలు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్‌లో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎంపికకు మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. 6 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించగా ఎన్నికల అధికారులుగా ఉపాధ్యాయులు వ్యవహరించారు. మొత్తం 18 మంది అభ్యర్థులు బరిలో నిలవగా సుమారు 1000 మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓటు వేసే ముందు విద్యార్థుల చూపుడు వేలుకు సిరా చుక్క పెట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ సాధారణ ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే ఈ ఎన్నికలు నిర్వహించామని తెలిపారు.

బస్‌పాసులను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న మల్లేశ్‌యాదవ్

దుండిగల్: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్ పాస్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఆనబోయిన మల్లేశ్‌యాదవ్ సూచించారు. గోవింద్ విజయేందర్ రెడ్డి సూచన మేరకు దుండిగల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఆర్టీసీ బస్ పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఈ బస్సు పాస్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ విద్యార్థులకు సరైనా కుర్చీలు లేవని ఆయన దృష్టికి తీసుకెళ్లగా వాటిని సమకూరుస్తానని మల్లేశ్‌యాదవ్ హామీనిచ్చారు. కార్యక్రమంలో భానుప్రకాశ్, రాజేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి




మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావుకు వినతి పత్రం ఇస్తున్న ప్రవీణ్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బండారి లేఅవుట్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో కమిషనర్ రామకృష్ణారావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బండారి లేఅవుట్ రోడ్డు నంబర్–1లో నిత్యం వాహనాల రద్దీ ఉంటుందని, రోడ్డు దాటే క్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కమిషనర్ కూడా సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



పోలీసుల అదుపులో గంజాయి విక్రయిస్తున్న నిందితులు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

మూసాపేట: మూసాపేటలో గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి మైత్రి నగర్‌కు చెందిన లింగారెడ్డి (25) ప్రయివేట్ జాబ్ చేస్తున్నాడు. మహేందర్ (20) జగద్గిరిగుట్టలోని వెంకటేశ్వర నగర్‌లో నివాసం ఉంటూ ఐస్‌క్రీమ్ అమ్ముతుంటాడు. కొమ్ము రాకేశ్(22) జగద్గిరిగుట్టలోని ఇందిరమ్మ హిల్స్‌లో నివాసం ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మూసాపేట మెట్రో స్టేషన్ పక్కన పదావుబడ్డ భవనం ఖాళీ స్థలంలో గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. 12 ప్యాకెట్లలో సుమారు 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే న్యాయం



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు, ఉప కులాలకు న్యాయం జరుగుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆగస్టు 5వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో మాదిగ మహా కూటమి ఆధ్వర్యంలో తలపెట్టిన మహాధర్నా పోస్టర్‌ను బాచుపల్లిలోని కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో మహా కూటమి నాయకులు ఎస్ఎస్ఆర్ రాజు, తలారి చైతన్య, లక్ష్మణరావు, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

మగ్దుంనగర్‌లో అన్నదానం



జగద్గిరిగుట్ట : డివిజన్ పరిధిలోని మగ్దుంనగర్‌లోని (బొడ్రాయి కమిటీ)ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని స్థానిక నాయకుడు కొలుకుల జైహింద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ్దుంనగర్‌లోని ఎల్లమ్మ, పోచమ్మ బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నరేందర్, విట్టల్ గౌడ్, లక్ష్మణ్, రాజేశ్, వినోద్, విగ్నేష్, మహమూద్, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఇంద్రసేన, మురళి

మూసాపేట: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల యూసీడీ, పీఓ ఇంద్రసేన, మూసాపేట సీవో మురళి అన్నారు. మంగళవారం మూసాపేటలో ఇంటింటికీ తిరిగి దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోమ కాటు ద్వారా వివిధ రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. నీటిలో పెరిగే దోమలను పిల్ల దశలోనే నిర్మూలించాలని వివరించారు. నీటి నిల్వలు, పాడైపోయిన డ్రమ్ములు, సిమెంటు తొట్టెలు, కుండీలు, కూలర్లు, పూలకుండీల్లో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ మురళి, ఆర్‌పీ శ్రావణి, మహిళా సంఘాల సభ్యులు, ఎంటమాలజీ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు ఎప్పుడో..?



జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద

ఇటీవల కురిసిన వర్షాలతో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రధాన మార్గాల్లోని రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వివిధ జిల్లాలు, నగరం నుంచి ఆర్టీసీ బస్సులతో పాటు కూకట్‌పల్లి నుంచి వాహనదారులు ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా సంజయ్‌గాంధీనగర్ నుంచి గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో పలు చోట్ల కాంక్రీట్ రోడ్డు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. ఇక షాపూర్‌నగర్ మార్కెట్ నుంచి న్యూ షాపూర్‌నగర్, ఎల్బీనగర్‌కు వెళ్లే రోడ్లు పలు చోట్ల కొట్టుకుపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొత్త రోడ్లు మంజూరు చేసేలోగా గుంతల వద్ద ప్యాచ్ వర్క్‌లైనా చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. –రంగారెడ్డినగర్



షాపూర్‌నగర్ మార్కెట్ నుంచి ఎల్‌బీ నగర్‌కు వెళ్లే రోడ్డు..



కొట్టుకుపోయిన సంజయ్‌గాంధీనగర్–గాంధీనగర్ రోడ్డు ..

చినుకు పడితే చిత్తడే..!



దేవేందర్‌నగర్, కైసర్‌నగర్ ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సుభాష్‌నగర్: దేవేందర్‌నగర్–కైసర్‌నగర్ ప్రధాన రోడ్డు చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతోంది. భారీ వర్షం వచ్చిందంటే వరద దిగువ ప్రాంతానికి వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.